27న మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఏఎస్ దినేష్ కుమార్, సంయుక్త కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ అభిషేక్ గౌడ్ ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 27న శుక్రవారం కాఫీ హౌస్ మెయిన్ రోడ్డు పాడేరులో మెగా రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.గౌరీ శంకర్రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఏరియా హాస్పిటల్ ఉన్న బ్లడ్ బ్యాంకులో పూర్తిగా రక్త నిల్వలు అందుబాటులో లేని కారణంగా ఈ కార్యక్రమాన్ని అత్యవసరంగా నిర్వహిస్తు న్నామని, యువతి యువకులు స్వచ్ఛంద సేవా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ, పోలీస్ శాఖ, వైద్య శాఖ సిబ్బంది రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించి సహకరించాలని కోరారు.

వర్షాలతో చిత్తడిగా రహదారులు

-ఇబ్బంది పడుతున్న వాహనదారులు
-పలు గ్రామాల్లో నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని జిసిసి పెట్రోల్ బంక్‌కు వెళ్లే రోడ్డు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పూర్తిగా బురద మయంగా మారి ఉండడంతో బంకుకు వెళ్లే వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన జిసిసి పెట్రోల్ బంక్ ఉండడంతో రోడ్డు నిర్మించే సమయంలో కొంత భాగాన్ని తొలగించారు. రోడ్డు నిర్మాణం పూర్తయ్యి డ్రైనేజీ కాలువలు నిర్మించారు. అయినా ఇప్పటికి బంకుకు వెళ్లే రహదారి పనులు పూర్తి చేయక పోవడంతో ప్రస్తుతం వెళ్లే రోడ్డు గుంతలుగా ఏర్పడి వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరు నిల్వ ఉండి పూర్తిగా బురదమయంగా తయారవుతుంది. దీంతో పెట్రోల్ డీజిల్ వేయించుకునేందుకు వెళ్తున్న వాహనదారులు, ఆటోవాలాలు పలు ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ హైవే రోడ్డు నిర్మించి సుమారు ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ పెట్రోల్ బంక్ మార్గాన్ని మరమత్తు చేయక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు అంటున్నారు. ఈ రోడ్డు గుండా నిత్యం ఉన్నతాధికారులు పర్యటిస్తున్నారు. కానీ మరమత్తు చేయడంలో పట్టించుకోలేదని పలువురు అంటున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి స్థానిక మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ కు వెళ్లే రహదారిని మరమత్తు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా అరకు -విశాఖ రహదారి

అరకు లోయ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనద్రోణితో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో అరకు -విశాఖ ఘాట్ రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. దీంతో, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో వాహన చోదకులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అరకు నుంచి మొదలుకొని ఏజెన్సీ ముఖద్వారం చిలకలగడ్డ వరకు వాహన చోదకులు బిక్కు బిక్కుమంటూ ప్రయాణించవలసిన పరిస్థితి ఏర్పడింది. రోడ్లపై ఇరువైపులా డ్రైనేజీలు కూడా లేక పోవడంతో రోడ్లపైనే వర్షపు నీరు చెరువును తలపిస్తుండటంతో ప్రయాణికులు అరచేతుల్లో ప్రాణం పెట్టి ప్రయాణిస్తున్నారు. రోడ్డుకు విరువైపులా డ్రైనేజీ కాలువలు నిర్మించాలని లేని పక్షంలో వాహన చోదకులకు నిరంతరం ఇబ్బందులు తప్పవని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుంకరమెట్ట, బిస్సురం, తైడా వద్ద మరింతగా రోడ్డుపై వర్షపు నీరు పారుతుండటంతో వాహన చోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనంతగిరి: మండలంలోని తుఫాను కారణంగా మారుమూల గ్రామాల మట్టి రోడ్లు బరద మయంగా తయారయ్యాయి. మూడు కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా ఏకధాటిగా కురుస్తున్న వర్షాల కారణంగా మారుమూల గ్రామాల రోడ్లు అడుగు వేసి అడుగు తీయలేని పరిస్థితి నెలకొంది. వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అనంతగిరి పంచాయతీ పరిధి లక్ష్మీపురం మైయిన్ రోడ్డు నుండి రాజుపాక మీదుగా డెక్కపురం, పెద్దూరు మీదుగా మాలింగవలస, పాతకోట, రేగం, నందిగుమ్మి, మద్దిగారు, రేగం నుండి తేనేపుటు, వాలసి పంచాయతీ జెండాగరువు నుండి ఊటగెడ్డ, బొడ్డపాడు .మీదుగా పుట్టపాడు, తెల్లరపాడు, లుంగపర్తి పంచాయతీ మెట్టువలస నుండి మల్లుంగుమ్మి, గోనుకొండ, ఎగువ పట్టి మెయిన్ రోడ్డు నుండి కివర్ల పంచాయతీ బొంగిజ వెంగడ పంచాయితీ గోమంగిపాడు, పినకొట పెద్దకొట, కివర్ల పంచాయతీ టెంకలబంద, పూతికపుటు, జడలమామీడి రోడ్లు బురద మయంగా మారాయి. అలాగే చిలకలగెడ్డ పంచాయతీ దాసరి తోట మీదుగా మర్రిపాలేం గ్రామాల్లోని రోడ్డు ఇదే పరిస్థితిలో ఉన్నాయి. ఇప్పటికైనా ఉమ్మడి కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆయా గ్రామలకు బీటీ రోడ్లు మంజూరు చేయాలని గిరిజనులు కోరుతున్నారు

అనంతగిరి మండలం రాజుపాకలో బురదగా ఉన్న రోడ్డు

అనంతగిరి మండలం గోమంగిపాడులో జీపును నెడుతున్న గిరిజనులు

దుంబ్రిగుడలో పెట్రోల్ బంక్ వద్ద బురదగా ఉన్న రోడ్డు

బురగా ఉన్న అరకు- విశాఖ రోడ్డు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

పోలవరం నిర్వాసితులు పోరాటాలకు సిద్ధం కావాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

ప్రజాశక్తి-కూనవరం

పోలవరం నిర్వాసితులు తమ సమస్యలు పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పిలుపునిచ్చారు. స్థానిక మార్త శ్రీరామ్మూర్తి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, భూ ప్యాకేజీ, పునరావాసం తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్న నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ద్వంద్వ విధానం ఇకనైనా విడనాడాలని, ముందు నిర్వాసితులకు ప్యాకేజీ ఇచ్చిన తర్వాతే ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ముంపు ప్రాంతాల్లో గోదావరి ముంపు సమస్యతో పాటు రైతులు ప్రకృతి వైపరీత్యాల వల్ల తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో నిర్వాసితులకు ఏ విధంగా న్యాయం చేయాలో కాకుండా ప్రాజెక్టు ఎంత త్వరగా కట్టాలో ప్రభుత్వం ఆలోచిస్తుందని ఎద్దేవా చేశారు. నిర్వసితులకు న్యాయం చేయకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పల్లపు వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, నాయకులు పాయం సీతారామయ్య, సర్పంచ్ మడకం నాగమణి, రామారావు, తమ్మయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు, కర్నాటి శ్రీనివాసరావు, మడం బాబు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బకోట గ్రామ సమీపంలో అధికంగా కురుస్తున్న మంచు

మన్యంలో మిశ్రమ వాతావరణం

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో బుధవారం మిశ్రమ వాతావరణం నెలకొంది. ఉదయం 6 గంటలకు చిన్నపాటి వర్షం ముసురును తలపించే విధంగా పడింది. ఉదయం 9 గంటలకు కాస్త ఎండ కాసింది. అనంతరం మబ్బులతో కూడిన వాతావరణం నెలకొంది. చల్లటి చలి గాలులు వీస్తూ చలి తీవ్రత అధికమైంది. దారకొండ, దుప్పిలివాడ పరిసర ప్రాంతాల్లో అధిక మొత్తంలో మంచు కురిసింది. మంచు, చలి తీవ్రత తాళలేక ప్రజలు నానా అవస్థలకు గురయ్యారు. అతి శీతల వాతావరణం, చల్లటి గాలుల వల్ల చలి తీవ్రతను తట్టుకోవడానికి గిరిజనులు చలిమంటలు వేసుకుంటూ ఉపశమనం పొందారు. ఈ మిశ్రమ వాతావరణం వల్ల దీర్ఘకాలిక రోగులు అష్ట కష్టాలకు గురయ్యారు. చలితోనే ప్రజలు చర్చల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు.

ఎంపిహెచ్ఇఒ జోజిబాబు మృతికి సంతాపం

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం సీలేరు పిహెచ్‌సి ఎంపిహెచ్ఇఒ జోజిబాబు మృతికి ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఖాదర్ మస్తాన్ వల్లి, ఆస్పత్రి సిబ్బంది ప్రగాఢ సంతాపం తెలియజేశారు. క్రిస్మస్ పండగ నిమిత్తం సొంత గ్రామం ఏలేశ్వరం వెళ్లిన జోజిబాబుకు మంగళవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ఆయాసం ఎక్కువగా రావటంతో కుటుంబ సభ్యులు వైద్య సేవలు నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు డాక్టర్ ఖాదర్ మస్తాన్ వల్లి పేర్కొన్నారు. జిల్లాలోని గరుగుబిల్లి పిహెచ్సి నుంచి ఏడాది క్రితం సీలేరు పీహెచ్సీకి బదిలీపై వచ్చారని, విధి నిర్వహణలో నిబద్ధత కలిగిన వ్యక్తి జోజిబాబు అని కొనియాడారు. జోజిబాబుకు భార్య నలుగురు కుమారులు ఉన్నారని, పెద్ద కుమారుడు ఎస్ఐగా, రెండో కుమారుడు కేరళలో సేఫ్టీ ఫైర్ ఆఫీసర్‌గా మూడో కుమారుడు బ్యాంక్ క్యాషియర్‌గా పని చేస్తుండగా, నాలుగో కుమారుడు ఉన్నత చదువులు చదువుతున్నాడని తెలిపారు. ఈ మేరకు జోజిబాబు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వర్షాలకు కాకరపాడు రహదారి బురదమయం

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం కాకరపాడు నుంచి కొయ్యూరు వచ్చే రహదారి వర్షాలు కారణంగా బురదమయమైంది. రోడ్డు ఇరువైపులా వేసిన మట్టి వర్షానికి రోడ్లపైకి వచ్చి చేరడంతో ఈ పరిస్థితి నెలకొంది. బురద వల్ల రహదారి ప్రమాదభరితంగా మారింది. మట్టి బురద ద్విచక్ర వాహనాల గేర్లకు, చక్రాలకు అడ్డంపడి వాహనాలు స్కిడ్ అయ్యాయి. బస్సులు సైతం గంట సేపు ఆగక తప్పలేదు. విధిలేని పరిస్థితుల్లో ఆర్టీసీ బస్సులో ప్రయాణికులు దిగి కొంత దూరం కాలినడకన ముందుకు సాగారు. ప్రమాదకర మలుపు వద్ద బురదమయం కావడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సులు సైతం నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మలుపు వద్ద బురదగా ఉండడంతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

సుంకరమెట్ట కాఫీ తోటలో పర్యాటకులు

వర్షంలోనూ తరలివచ్చిన పర్యాటకులు

-ఘాట్ రోడ్డులో నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి-అరకు లోయ: పర్యాటక కేంద్రమైన అరకు లోయలో భారీ వర్షంలోనూ కూడా పర్యాటకుల సందడి చేశారు.క్రిస్మస్ సెలవు దినం కావడంతో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పర్యాటకులు తరలివచ్చారు. దీంతో, అరకులోయ ప్రాంతంలోని సందర్శిత ప్రాంతాలు, గిరిజన సంస్కృతిక మ్యూజియం, కాఫీ మ్యూజియం, పద్మావతి ఉద్యానవన కేంద్రం, సుంకరమెట్ట కాఫీ తోటలు సందర్శకులతో కళకళలాడాయి. పర్యాటక సీజన్ ముగియ వస్తుండడంతో పర్యాటకుల తాకిడి పెరిగినట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివస్తుండటంతో అరకు ఘాట్ రోడ్డులో వాహనాల రద్దీ కూడా పెరిగింది. ముఖ్యంగా సుంకరమెట్ట కాఫీ తోటలో పర్యాటకులు అధిక సంఖ్యలో సందర్శించి వీక్షిస్తున్నారు.

అరకు ఘాట్ రోడ్ లో నిలిచిన వాహనాలు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-పాడేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు వచ్చే నెల 7వ తేదీ నుండి 13 వరకు జైపూర్, రాజస్థాన్ లో జరిగే సీనియర్ జాతీయ వాలీబాల్ (పురుషులు మహిళలు) క్రీడా పోటీలకు రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 27న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఏ.జగన్మోహన్రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ పురుషులు, మహిళల జట్లు రాష్ట్రస్థాయి ఎంపికలలో పాల్గొనుటకు ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 27న ఉదయం 7 గంటలకు ఆధార్ కార్డు, ధ్రువ పత్రాలు, 10 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ విజయవాడలో వాలీబాల్ గ్రౌండ్ లో హాజరు కావలసినదిగా, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.జగన్మోహన్‌రావు తెలిపారు. ఇతర వివరములకు ఫోన్ : 9394494645కు సంప్రదించాలని కోరారు..

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఊట్ల క్వారీని నిలుపుదల చేయాలి

- వ్యక్తి మృతికి కారణమైన వారిపై క్రిమినల్ కేసు నమోదుచేయాలి
- సిపిఎం నేతలు బొప్పెన కిరణ్, లోతా రామారావు, మట్ల వాణిశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం

మండలంలోని ఊట్ల క్వారీలో ప్రమాదం జరిగి ఒక వ్యక్తి మృతికి కారణమైన క్వారీ నిర్వాహకులపై తక్షణమే క్రిమినల్ కేసు నమోదు చేయాలని, ఈ సంఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఈ క్వారీని తక్షణమే నిలుపుదల చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, మట్ల వాణిశ్రీ బుధవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. రంపచోడవరం మండలం ఊట్ల క్వారీలో ప్రమాదం జరిగి ఒక వ్యక్తి మతి చెందగా, ఇంకో వ్యక్తి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారని, వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రంపచోడవరం ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా క్వారీలు నిర్వహిస్తున్నారని, విచ్చలవిడిగా మైనింగ్ చేస్తుంటే మైన్స్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అక్రమ క్వారీలపై ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్ దృష్టి పెట్టకపోవడం సరికాదన్నారు. విచ్చలవిడిగా బ్లాస్టింగ్ చేస్తూ గిరిజనుల ప్రాణాలు బలి తీసుకుంటున్నా ఉన్నతాధికారులకు ఎందుకు ఇంతటి నిర్లక్ష్యమని ప్రశ్నించారు. ఘటన జరిగి 24 గంటలు గడుస్తున్నా ఇప్పటివరకు పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి బాద్యులపై చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఈ ఘటనపై మైనింగ్ అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్, మైనింగ్ అధికారులు స్పందించి ఊట్ల క్వారీలో వ్యక్తి మృతుపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టాలని, దీనికి బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టాలని, అక్రమ క్వారీలు నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని అధికారులను వారు హెచ్చరించారు.

గంజాయి అక్రమ రవాణాపై పోలీసుల దృష్టి

విస్తృతంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి-సీలేరు

గంజాయి అక్రమ రవాణాపై సీలేరు ఎస్సై రవీంద్ర ఆధ్వర్యాన పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా బుధవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. జీకే వీధి మండలం సీలేరు ప్రధాన కుడళ్లలో సిఆర్పిఎఫ్, సివిల్ పోలీసులను మోహరించి అణువణువున తనిఖీలు చేశారు. ఆంధ్రా, ఒరిస్సా, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చే పోయే వాహనాలను నిలిపివేసి క్షుణ్ణంగా పరిశీలించి, వారి వివరాలు సేకరించి విడిచిపెట్టారు. గంజాయి అక్రమ రవాణా, సాగు నివారణపై పోలీసులు మారుమూల గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. అయినప్పటికీ ఆంధ్ర ఒరిస్సా సరిహద్దులు నుంచి మైదాన ప్రాంతానికి స్మగ్లర్లు గుట్టు చప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్నారు. గంజాయి అక్రమ రవాణాపై ఇంటెలిజెన్సీ వర్గాలు పదేపదే హెచ్చరికలు చేయడంతో ఆ దిశగా పోలీసులు దృష్టి సారించి తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. స్థానిక ఏపీ జెన్కో చెక్‌పోస్టు ఆఫీస్ ఐటిఐ జంక్షన్ కుడళ్లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసు తనిఖీలు చేశారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై రవీంద్ర సూచించారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ రవీంద్ర, పోలీసులు

కెజిబివిలో దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని కోతులగుట్ట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం కాలేజ్ హాస్టల్లో 270 మంది విద్యార్థినులకు ఎఎస్‌డిఎస్ ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. తమ విద్యాలయం పిల్లలకు రూ.54వేలు విలువగల దుప్పట్లు అందించినందుకు ప్రిన్సిపాల్ స్వరాజ్యం ఎఎస్‌డిఎస్ డైరెక్టర్ గాంధీబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వి.హరిబాబు నాట్వాన్, సంఘం ఉపాధ్యక్షురాలు సోయం నాగమణి, క్లస్టర్ కోఆర్డినేటర్స్ నీరుపాటి రవి, పూజిత, ఉపాధ్యాయులు దుర్గ, విజయ, రాణి, ఎఎన్ఎం పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

క్రిస్మస్ వేడుకల్లో వికలాంగులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు తదితరులు

ప్రజాశక్తి- యంత్రాంగం

విఆర్.పురం : మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రార్థన మందిరాలు సుందరంగా అలంకరించారు. విఆర్.పురం సంతపాకల వద్ద ఉన్న ప్రార్థన మందిరంలో పాస్టర్ డేవిడ్ లివిస్టాన్, విఆర్ పురం బీసీ కాలనీలో త్రియేక ప్రార్థన మందిరంలో పాస్టర్ యేసు రత్నం ఆధ్వర్యాన ఏసుక్రీస్తు జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, నాయకులు సోయం చిన్నబాబు, పంకు సత్తిబాబు, సిపిఎం బృందం క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. విఆర్.పురం బీసీ కాలనీ త్రియేక ప్రార్థన మందిరంలో ఎంపీపీ కారం లక్ష్మి, సున్నం రాజులు చేతుల మీదుగా వికలాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. క్రిస్మస్ కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి దూత క్రీస్తు జన్మించిన సుదినం ఎంతో గొప్పదన్నారు. ఏసు క్రీస్తు జీవితం అందరకీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. క్రిస్మస్ సందర్భంగా మండలంలో అన్ని ప్రార్థన మందిరాల్లో జరిగిన వేడుకల్లో వారు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. వచ్చిన సంఘస్తులకు, గ్రామ ప్రజలకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో సిపిఎం నాయకులు పోడియం శ్రీరామ్మూర్తి, సిరపు తాతబాబు, వడ్లది రమేష్, సోడి మల్లయ్య, కె.సత్యనారాయణ, జి.లక్ష్మణరావు, సిహెచ్.సుబ్బారావు, చర్చి సంఘ పెద్దలు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు సీసం సురేష్

చర్చిలకు వెళ్లి శుభాకాంక్షలు తెలియజేసిన సిపిఎం నేతలు, పజాప్రతినిధులు

చింతూరు : చింతూరు, ఎర్రంపేట గ్రామాల్లో క్రిస్మస్ సందర్భంగా చర్చిలకు సిపిఎం మండల కమిటీ నాయకులు వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు సీసం సురేష్ మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న బిజెపి దేశ ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ మతాల మధ్య ఐక్యతను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ఒకే దేశం, ఒకే మతం, ఒకే ఎన్నిక పేరుతో రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని, ప్రజల ప్రజాస్వామ్య హక్కులను దెబ్బతీసే విధంగా బిజెపి తన రహస్య ఆర్ఎస్ఎస్ ఏజెండాను ప్రజలపై రుద్దుతుందని తెలిపారు. ప్రపంచ శాంతిని కోరుకునే జీసస్ జయంతిని పురస్కరించుకొని బిజెపి విధానాలకు వ్యతిరేకంగా దేశ ప్రజలు సర్వమత ఐక్యతను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు పొడియం లక్ష్మణ్, మండల కమిటీ సభ్యులు కారం సుబ్బారావు, నాయకులు పోడియం జానీ, సవలం పంతులు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీది మండలం సీలేరు యుసిఐఎం చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చికి విద్యుత్ దీపాలు అలంకరించి ముస్తాబు చేశారు. మంగళవారం అర్ధరాత్రి చర్చిలో కేక్‌కట్ చేసి పరస్పరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి హ్యాపీ క్రిస్టమస్ హ్యాపీ క్రిస్టమస్ అంటూ నినాదాలు చేశారు. క్రిస్టమస్ తాత వేషధారణలో చిన్నారులు అలరించారు. చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. పెంతుకోస్తు గ్యాస్తమనే బచ్చులూరులో యూసిఐఎం చర్చల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మనసై యేసుక్రీస్తు విశిష్టత గురించి వివరించారు.

దుంబ్రిగుడ: క్రిస్మస్ పండుగ వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో యుసిఐఎం చర్చిలో కె.భాస్కర్ రావు ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. బేతెలు చర్చిలో పాస్టర్ సుదర్శన్ ఆధ్వర్యాన ఘనంగా జరుపుకున్నారు. క్రిస్మస్ కేక్‌లను కట్ చేసి విశ్వాసులకు పంచి పెట్టారు. ఈ గ్రామాలతో పాటు మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఈ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

అరకు లోయ: అరకులోయ మండలంలో వివిధ చర్చిల్లో బుధవారం క్రీస్తు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ ను పురస్కరించుకొని అన్ని చర్చిల్లో విద్యుద్దీపాలం కరణలతో కళకళలాడాయి. చర్చిల్లో పాటలు, ఆరాధనలతో ఆధ్యాత్మికత నెలకొంది. గద్య గూడ, మాలి సింగారం, పాణిరంగని, అరకువేలి, కొత్త బల్లుగూడ, సుంకరమెట్ట జనంగూడ, గుగ్గుడు, బెంజిపూర్ గ్రామాల్లో క్రిస్మస్ ఆరాధనలు జరిగాయి. గద్యగూడ సీయోను ప్రార్థన మందిరం, మాలిసింగరం చర్చిల్లో బిషప్ డాక్టర్ విజయ డానియల్ మోడీ క్రీస్తు పునరుత్థానంపై ప్రత్యేక సందేశం అందించారు. ప్రతి ఒక్కరు మారు మనస్సు కలిగి ఏసుక్రీస్తును పోలి జీవించాలన్నారు.

చర్చిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న దొన్నుదొర

ప్రజల పత్రిక ప్రజాశక్తి

ఆర్‌టిసి విజయనగరం జోన్ ఛైర్మన్ దొన్ను దొర

ప్రజాశక్తి-హుకుంపేట, దుంబ్రిగుడ: ప్రజల గొంతుక, ప్రజల కోసం పనిచేసే పత్రిక ప్రజాశక్తి అన్ని ఏపీ ఎస్ ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, అరకు ఇన్చార్జి సివేరి దొన్నుదొర కొనియాడారు. టీడీపీ అరకు ఇంచార్జి కార్యాలయంలో ప్రజాశక్తి క్యాలెండర్, డైరీ, కోర్టు క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ, ప్రజా సమస్యల పై పట్టున్న పత్రిక ప్రజాశక్తి అని ఆయన అన్నారు. తన చేతుల మీదుగా క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ చేయడం సంతోషంగా ఉందన్నారు. తాను ఉపాధ్యాయ వృత్తి నుంచి కూడా ప్రజాశక్తిని ఆదరించి ప్రోత్సహించే వాడేనని ఆయన గుర్తు చేశారు. అన్ని క్యాలండర్ల కన్నా అందంగా, సుందరంగా ప్రజాశక్తి క్యాలెండర్ ఉందన్నారు. సామాన్య ప్రజలు, ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు అందరూ ప్రజాశక్తి క్యాలెండర్ ఆదరిస్తారన్నారు. వాస్తవ కథనాలు ప్రచురించే నైజం ప్రజాశక్తి కే ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజాశక్తి దిన పత్రిక మంచి కథనాలతో ముందుకు సాగి తనదైన శైలిలో గుర్తింపు పొందిందన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెలికి తీసి పరిష్కరించే విధంగా మరింతగా పాటు పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి అరకు మండల అధ్యక్షుడు బాబురావు, జనసేన అరకు ఇంచార్జ్ ఎస్ చిరంజీవి, విశాఖ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ముల్లంగి శ్రీనివాస్ రెడ్డి, అనంతగిరి టిడిపి పార్టీ ప్రెసిడెంట్ బుజ్జి బాబు, పార్టీ కార్యదర్శి వి.వెంకటరావు, మాజీ సర్పంచ్ దూరు వీరన్న దొర, యూనిట్ ఇన్చార్జులు లక్ష్మణరావు, హరిబాబులు, ప్రజాశక్తి విలేకర్లు కొర్రా ఆనంద్, స్వామి, ప్రజాశక్తి అల్లూరి జిల్లా ఇన్చార్జి పి దేవుడు బాబు పాల్గొన్నారు,

మహిళల ఆర్థిక బలోపేతానికి మేళా దోహదం : ఎంపీ బాబూరావు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఎస్‌హెచ్‌జి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్‌హెచ్‌జి మేళాను నిర్వహిస్తున్నాయని రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు అన్నారు. విశాఖలోని గల ఎఎస్.రాజా కాలేజీ మైదానంలో 2024 ఎస్‌హెచ్‌జి మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా గొల్ల బాబూరావు మాట్లాడుతూ, విశాఖపట్నంలో స్వయం సహాయక సంఘ సభ్యులు తయారుచేసిన వస్త్ర, ఆహార ఉత్పత్తులు 100 స్టాళ్ల ఏర్పాటుతో ఐదు రోజులు పాటు సంజ ఉత్సవ్ - అప్నో కా ఉత్సవ్-2024ను జివిఎంసి, మెప్మా ఆధ్వర్యాన నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ మేళాను ప్రజలు సందర్శించి మహిళల ఆర్థిక బలోపేతానికి సహకరించాలని కోరారు. మహిళల అభ్యున్నతికి తనకు కేటాయించిన రూ.10 కోట్ల ఎంపీ నిధులను వినియోగిస్తానన్నారు.

జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో ఎస్‌హెచ్‌జి మహిళల అభ్యున్నతికి ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 25 నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ మేళాను ప్రజలందరూ వినియోగించుకోవాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, యుసిడి పథక సంచాలకులు పిఎం.సత్యవేణి, జివిఎంసి కార్పొరేటర్లు గొలగాని మంగవేణి, గేదెల లావణ్య, బిపిన్ కుమార్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

27న 'కర్ణ పిశాచి' విడుదల

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎస్‌బికె డ్రీమ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మించిన సస్పెన్స్, థ్రిల్లర్, హర్రర్ లవ్ స్టోరీ 'కర్ణ పిశాచి' చిత్రం ఈ నెల 27న రెండు తెలుగు రాష్ట్రాల్లో విడుదలవుతుందని చిత్ర దర్శకుడు విజయ్ మల్లాది తెలిపారు. డాబాగార్డెన్స్‌లోని తన కార్యాలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల విశాఖ, అరకు, చింతపల్లి, విజయనగరం పరిసర ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసినట్టు చెప్పారు.

'రెవెన్యూ సదస్సులపై ముందస్తు సమాచారం ఏదీ?

ప్రజాశక్తి -ముంచింగి పుట్టు: మండలంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ సదస్సులు తహసిల్దార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నపటికి ఆదివాసి గిరిజనులకు పారదర్శకంగా నిర్వహించడంలో వైఫల్యం చెందారని మండల వైస్ ఎంపీపీ 1 పాటుబోయి సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, రెవిన్యూ సదస్సుపై ప్రజలకు ముందస్తు సమాచారం ఇచ్చి ప్రజలకు అవగాహన కల్పించి ప్రజలు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉనప్పటికీ వాటికి విరుద్ధంగా నిర్వహించడం సరికాదన్నారు. రెవిన్యూ సదస్సులకు తహసిల్దార్ హాజరు కాకుండా వివిధ కారణాలు చెబుతుండటంలో ఆంతర్యం ఏమిటో తెలపాలన్నారు. రెవిన్యూ సదస్సు నిర్వహణపై గ్రామాల్లో దండోరా వేసి ముందస్తు సమాచారమిచ్చి అవగాహన పరిచి ప్రజలు హాజరయ్యే విధంగా చేయడంలో వైఫల్యం చెందుతున్నారని మండిపడ్డారు. ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కచ్చితంగా రెవిన్యూ సదస్సు కొనసాగించాలని డిమాండ్ చేశారు. తూతు మాత్రం నిర్వహిస్తూ సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారన్నారు.. పూర్తిస్థాయిలో నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రొబ్బ గణపతి, హరిబాబు, రామ్మూర్తి, ఆదిబాబు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనం, జిమ్ ప్రారంభం

జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

ప్రజాశక్తి -ములగాడ: జివిఎంసి 40వ వార్డు ఎకెసి కాలనీలో రూ.18 లక్షల జివిఎంసి నిధులతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని, అలాగే రూ.ఐదు లక్షల జివిఎంసి నిధులతో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలను బుధవారం స్థానిక వార్డు కార్పొరేటర్ డాక్టర్ గుండపు నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వార్డు పరిధిలో ఆసుపత్రి, కల్యాణమండపం, బడి గుడి, రోడ్లు, డ్రైనేజీలో ఇలా అనేక అభివృద్ధి పనులను చేపట్టాలమని, ఇపుడు సామాజిక భవనం, జిమ్‌ను ప్రారంభించామన్నారు. ఈ ప్రాంత ఏళ్లనాటి కల నేటికి సాకారమైందని,దీన్ని యువతకు అంకితమిస్తున్నట్లు వెల్లడించారు. పెద్దల సహకారాలతో వార్డులో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో గంటా వర్మ, వరపల మహేష్, గణేష్ మిశ్రా, గుండపు ఆశోక్, దేబర్కి కృష్ణ, జెర్రిపోతుల శివ, పట్నాల వెంకటేష్, బంటు కోటేశ్వరరావు, అన్నం వాసు, గుండపు సందీప్, పప్పల శివ, శేఖర్, ప్రవీణ్, సాంబ, భాస్కర్ పాల్గొన్నారు

విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు వినతి

ఎమ్మెల్యే గంటాకు వినతిపత్రం ఇస్తున్న నూకరాజు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు . నేరెళ్ళవలస కాలనీ, బోయివీధి, గొల్లలపాలెం, కృష్ణాకాలనీ, ఎగువపేట, గొల్లవీధి, తోటవీధి తదితర ప్రాంతాల్లో కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు కోరారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును నగరంలోని ఎంవిపి కాలనీలో అతని నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మరికొన్ని ప్రాంతాల్లో పాత విద్యుత్ స్తంభాలు స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై విద్యుత్‌శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చి, తక్షణ చర్యలు చేపట్టేలా చూడాలని కోరారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- సీతమ్మధార : అక్కయ్యపాలెం షాదీ కల్యాణ మండపం ప్రాంతానికి చెందిన 17ఏళ్ల బాలిక అదృశ్యంపై బుధవారం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల తెలిపిన వివరాలివి. షాదీ కల్యాణ మండపం సమీపంలో కేకులు విక్రయించే దుకాణంలో పనిచేస్తున్న బాలిక, పనిలో భాగంగా ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అయితే మరుసటి రోజు ఉదయానికి కూడా తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో బంధువులు, మిత్రులు ఇళ్లలో వెదికిన కుటుంబసభ్యులకు బాలిక ఆచూకీ లభించకపోవడంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివక్షత లేని సమాజానికి కెవిపిఎస్ పోరాటం

ప్రజాశక్తి- గాజువాక : వివక్షత లేని సమాజం కోసం కెవిపిఎస్ అనేక పోరాటాలు చేసిందని, తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం సాయంత్రం తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో కెవిపిఎస్ ముద్రించిన 2025 కేలండర్‌ను అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దళితులపై దాడులు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రెండు గ్లాసుల పద్ధతికి వ్యతిరేకంగా ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు బీవీ రాఘవులు ఆధ్వర్యంలో కెవిపిఎస్ ప్రత్యక్ష పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. వివక్షతపై ప్రజల్లో చైతన్యానికి సైకిల్ యాత్ర, ఇతర అవగాహన కార్యక్రమాలను కెవిపిఎస్ నిర్వహించిందన్నారు. నేటికీ దళితులపై దాడులు విచారకరమన్నారు.

ఇటీవల ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఇళయరాజాను దేవాలయాలకు రాకుండా బయట ఉంచిన విధానం ఇందుకు నిదర్శనమన్నారు. ఉత్తరప్రదేశ్‌లాంటి రాష్ట్రాల్లో నేటికీ దళితులపై హింస, హత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పైనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా అవమానకరంగా అనుచిత వ్యాఖ్యలను తప్పుపట్టారు.

బిజెపి ప్రభుత్వం అనేక రాజ్యాంగం సవరణలు చేస్తోందదని, అందులో భాగంగా ఎన్నికల సంఘం, ఎన్నికల్లో చేపడుతున్న సవరణలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ఎలక్షన్ కమిషన్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేకుండా తొలగించారన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు స్టీల్ ప్లాంట్ రక్షిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎ.తవిటయ్య, దయాసాగర్, రామారావు, మత్స్యరాజు, విష్ణు ప్రసాద్, దయాసాగర్, కెవిపిఎస్ నాయకులు వైటిదాస్, ఇమ్మాన్యుయేల్ పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వరరావు, అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాదర్బారులో సమస్యల పరిష్కారం

వచ్చేనెల మొదటి వారం నుంచి అధికారులతో కలిసి వార్డుల్లో పర్యటన : ఎమ్మెల్యే పల్లా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : వచ్చేనెల మొదటి వారం నుంచి ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా అధికారులతో వార్డులలో విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కరిస్తామని కృషి చేస్తామని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ. గాజువాక నియోజకవర్గంలో 50వేలు తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల నమోదులో భాగస్వాములైన బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్చార్జిలు, వార్డు క్లస్టర్లు, కార్యవర్గానికి, అందరికీ అభినందనలు తెలిపారు. టిడిపి సభ్యత్వాల నమోదును 80వేలకు పెంచేలా కృషి చేయాలన్నారు. తన ఉన్నతికి అన్ని విధాలుగా చేదోడువాదోడుగా ఉంటున్న నియోజకవర్గ ప్రజలకు, పార్టీ శ్రేణులకు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. వారి ప్రయోజనాలను కాపాడడం ద్వారా రుణం తీర్చుకుంటానన్నారు. నియోజకవర్గంలో పలు కీలకమైన అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తామన్నారు. ఉక్కు నిర్వాసితుల ప్రయోజనాలు కాపాడటానికి ఎవ్వరితోనూ రాజీ పడబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాస్, 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, 75వ వార్డు ఇంచార్జ్ పులి రమణారెడ్డి, మాజీ కార్పొరేటర్ ఎండీ. రఫీ, అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంగ కృష్ణ,, 70వ వార్డు ఇన్‌ఛార్జి చట్టి గోపి పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- సీతమ్మధార: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అక్కయ్యపాలెంలో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాలివి. సంఘమిత్ర సోషల్ సర్వీస్‌లో పనిచేస్తున్న వెంకటేష్ (27) రెండేళ్లుగా మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. కొంతకాలంగా గంజాయికి బానిసైన వెంకటేష్, తీవ్రమనస్తాపంతో సోమవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపర్ణకు కేంద్రమంత్రి అభినందన

ప్రజాశక్తి -మధురవాడ : సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్స్ అవార్డు 2024 అందుకున్న కూచిపూడి నృత్యకళాకారిణి అపర్ణను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అభినందించారు. గురువారం విశాఖ విమానాశ్రయంలో కేంద్రమంత్రి రామ్మోహన నాయుడును అపర్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అపర్ణను ప్రశంసలతో ముంచెత్తిన కేంద్ర మంత్రి, తెలుగువారి ప్రతిభ. ఆంధ్రుల అత్యుత్తమ కౌశలానికి తార్కాణంగా నిలిచిన అపర్ణ, కూచిపూడి నత్యానికి ఐకాన్ కావాలని ఆకాంక్షించారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మరిన్ని ప్రదర్శనలు ఇచ్చి. ఉన్నత కీర్తి కిరీటాలు అందుకోవాలని, ఉన్నత ప్రజ్ఞతో రాణిస్తున్న అపర్ణకు మంచిభవిష్యత్తు ఉందని ఆశీస్సులందించి, అభినందించారు.

'ఓలా' షోరూం ప్రారంభం

పెందుర్తిలో ఓలాషోరూం ప్రారంభిస్తున్న అప్పలనాయుడు

ప్రజాశక్తి- పెందుర్తి : దేశంలో అతిపెద్ద ప్యూర్‌ప్లే ఈవీ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ షోరూం, సర్వీస్ సెంటర్‌ను బుధవారం పెందుర్తి జంక్షన్‌లో మాజీ కార్పొరేటర్ శరగడం చిన అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై ఇపుడు వాహనదారులు మక్కువ చూపుతున్నారని,భవిష్యత్తు ఎలక్ట్రిక్ వాహనాలదేనన్నారు. ఈ సందర్భంగా ఓలా కోస్టల్ సిటీలీడ్ వాన లోకేశ్వరరావు మాట్లాడుతూ ఇవి రంగంలో ప్రముఖమైన ఓలా నెట్‌వర్క్ ఇపుడు దేశవ్యాప్తంగా నాలుగు వేల సోర్లు, 3,200 సర్వీస్‌సెంటర్లకు విస్తరించిందన్నారు. అతి తక్కువ ధరకు ఎన్నో ఫీచర్లతో లభిస్తున్నాయని తెలిపారు. ఓలా ఏరియా సర్వీస్ మేనేజర్ డీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ. ఎస్1 పోర్ట్ ఫోలియోపై రూ.25 వేల వరకు ఆకర్షనీయమైన ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని వినియోగించుకోవాలన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

వృద్ధులకు నిత్యావసరాలు అందజేస్తున్న డాక్టర్ ఉమర్ ఆలీషా

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక విశ్వ విజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో ఆశ్రమ ప్రాంగణంలో బుధవారం 40 మంది నిరుపేద వృద్ధులకు 5 కిలోల బియ్యం, అర కిలో చొప్పున కందిపప్పు, చింతపండు, వంట నూనె, పంచదార పంపిణీ చేశారు. పీఠం 23వ వార్షికోత్సవం సందర్భంగా పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ తెలుగు విభాగం నుంచి డాక్టర్ వెంకటేశ్వర యోగి, సాహితీవేత్త పరవస్తు ఫణి శయనసూరి, మనోజ్ కుమార్ జైన్, పీఠంకన్వీనర్ డాక్టర్ పింగళి ఆనందకుమార్, డాక్టర్ ఎ రాధాకృష్ణ, డివి నారాయణరావు పాల్గొన్నారు